
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.4 | కనిష్ఠం 18.6



దాసంజనేయ స్వామి గుడి సంప్రోక్షణ

భిక్కనూరు, ఆగస్టు 31: మండలంలోని జంగంపల్లి గ్రామంలో గల శ్రీ దాసంజనేయ స్వామి ఆలయ సంప్రోక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామి వారిని అలంకరించి వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు అత్తిల్లి శ్రీనివాస్, కమిటీ సభ్యులు గ్రామస్థులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బాన్సువాడ బీఆర్ఎస్‌లో..

అయోమయం!

కామారెడ్డి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి అయోమయంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోచారం గెలిచినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి నియోజకవర్గం నుంచి తగిన మెజార్టీ రాలేకపోయింది. పదేళ్ల పాటు ఏకచత్రాధిపత్యం నడిపిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాటి నుంచి బీఆర్ఎస్ కార్యకర్తల్లో అయోమయం నెలకొంటూ వస్తోంది. ప్రస్తుతం ఆ నియోజకవర్గానికి బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ అధికారికంగా లేకపోవడంతో తమ గోడు వినే వారే కరువయ్యారని కార్యకర్తలు వాపోతున్నారు. అయితే బాన్సువాడ నియోజకవర్గంపై మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బాన్సువాడలో బీఆర్ఎస్ చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమానికి బాజిరెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలకు సైతం బాజిరెడ్డి భరోసా ఇస్తున్నట్లు తెలుస్తోంది.



పోచారం బీఆర్ఎస్‌ను వీడడంతో సీరియస్‌గా తీసుకున్న అధిష్ఠానం

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి విజయం సాధించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు గట్టిదెబ్బ తగిలింది. కేసీఆర్ పోచారానికి ఐదేళ్లు మంత్రిగా మరో ఐదేళ్లు స్పీకర్‌గా అవకాశం ఇచ్చి గౌరవిస్తే పార్టీకి ద్రోహం చేసి వెళ్లారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహంతో ఉన్నారు. దీంతో పోచారం పార్టీని వీడడాన్ని బీఆర్ఎస్ అధిష్ఠానం సీరియస్‌గానే తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. బాన్సువాడ పార్టీ క్యాడర్ అధిష్ఠానం అండగా ఉంటుందని త్వరలోనే అక్కడ తానే సమావేశం పెడతానని చెప్పారు. ప్రస్తుతం బాన్సువాడ నియోజకవర్గంపై మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టి సారించారు. త్వరలో బాజిరెడ్డికి బాన్సువాడ పగ్గాలు అప్పగిస్తుందని ఆ పార్టీలో చర్చ సాగుతోంది.

- నియోజకవర్గ ఇన్‌చార్జి లేక తిప్పలు
- ముంచుకొస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు
- నాయకులు లేక క్యాడర్‌లో నిరుత్సాహం
- బాన్సువాడ ఇన్‌చార్జీని ప్రకటించని బీఆర్ఎస్ అధిష్ఠానం
- పోచారం కాంగ్రెస్‌లో చేరాక డీలాపడ్డ బీఆర్ఎస్
- బాన్సువాడపై దృష్టి సారించిన బాజిరెడ్డి

చేజారుతున్న క్యాడర్

బాన్సువాడలో బీఆర్ఎస్ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. గతంతో పోల్చుకుంటే చాలామంది ఆ పార్టీ నేతలు కాంగ్రెస్‌లో చేరిపోయారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో నియోజకవర్గంలోని మెజార్టీ స్థాయి మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఆ పార్టీలో చేరారు. ఇప్పటికే ఆయా మండలాల్లో అధికార పార్టీపై విమర్శలు ఎక్కుపెడుతుండగా ఇక్కడ మాత్రం అంతాస్తబ్దుగా మారింది. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రైతు రుణమాఫీ సమస్యపై బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కేంద్రాలు,మండల కేంద్రాల్లో ఆందోళనకు పిలుపునిచ్చింది. బాన్సువాడ పట్టణ కేంద్రంలో రైతు ధర్నాలో బాజిరెడ్డి పాల్గొన్నారు. బాజిరెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఉన్న నాయకులకు కాస్త భరోసానిస్తున్నారు. అయినప్పటికీ గట్టి నాయకత్వం లేకపోవడంతో పార్టీ నాయకులు ఉత్సాహంతో పని చేయడం లేదు. జయంతులు, వర్ధంతులు తప్ప సమస్యలపై పోరాటం చేయడంతో విఫలమవుతున్నారు. ఇటీవల ఎంపీపీ, జడ్పీటీసీల పదవికాలం ముగియడంతో వారి జాడ కనిపించడం లేదు. అలాగే బాన్సువాడ పట్టణంలో పార్టీని నడిపించే ముఖ్య నాయకులు కరువయ్యారు. మున్సిపాలిటీలోని మెజార్టీ బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్‌లో ఉన్నవారు ఇళ్లు దాటి బయటకు రావడం లేదు.

ఆశావహుల్లో గుబులు

సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచే ఆశావహుల్లో గుబులు మొదలైంది. క్యాడర్ సరిగ్గా లేనప్పుడు పోటీచేసి అప్పులపాలు కావాలా అంటూ వాపోతున్నారు. అధికారంలో లేకపోవడం భారీగా డబ్బులు పెట్టి గెలిచిన ప్రయోజనం ఏంటని అంతర్‌మథనం సాగుతోంది. ఒక్కో సర్పంచ్ అభ్యర్థి రూ.10 నుంచి రూ.15లక్షల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. దీంతో గులాబీ నాయకులు ఇప్పటి నుంచి వాటిపై దృష్టి సారిస్తున్నారు.



బాన్సువాడలో భారీ వర్షం



జలమయమైన బాన్సువాడ

బాన్సువాడ, ఆగస్టు 31: బాన్సువాడ డివిజన్‌లో ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం శనివారం కురిసింది. మూడు గంటలుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎస్‌బీఐ బ్యాంకు, తాడ్‌కోల్ చౌరస్తా వంటి ప్రధాన రహదారుల వద్ద భారీగా నీరు చేరడంతో వాహనదారులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కార్లు, ద్విచక్ర వాహనదారులు నీటిలో మునిగాయి. పలు కాలనీలు జలదిగ్బంధంలో ఉండిపోయాయి. మూడు గంటలుగా భారీ వర్షం కురవడంతో విద్యుత్ అంతరాయం కలిగింది. జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం మండలం మద్దెల చెరువు వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. బిచ్కుంద, పిట్లం, బాన్సువాడకు రాకపోకలు నిలిచాయి. గంటల పాటు ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. బాన్సువాడ నిజామాబాద్ బోధన్ ప్రధాన రహదారి అంకుల్ తండా వద్ద రోడ్డు విస్తరణలో భాగంగా తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయడంతో అది నీటిలో మునిగిపోయింది. నసురుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో పిడుగు పడడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీనిని గమనించని స్వాతి(18) అనే యువతికి విద్యుత్ వైర్లు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బొప్పాస్‌పల్లిలో పిడుగు పడడంతో కేమ్యా అనే వ్యక్తికి తగలడంతో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రికి తరలించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అభివృద్ధిని వదిలేసి..

అడ్డుకోవడంలో పోటీ పడుతున్నారు

ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 31: కామారెడ్డి అభివృద్ధిని వదిలేసి అడ్డుకోవడంలో పోటీ పడుతున్నారని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో రెండు ట్రాక్టర్లను జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం-స్వచ్ఛదనంలో కామారెడ్డి మున్సిపల్ రాష్ట్రంలోనే ముందుండాలని అన్నారు. కామారెడ్డి ఎన్నికల్లో పోటీ చేయకున్నా కూడా కామారెడ్డి పుట్టిన గడ్డపై ఉన్న ప్రేమతో అభివృద్ధికి కృషి చేస్తున్నానని అన్నారు. ఎన్నికల వరకే పార్టీలు పంతాలు, పట్టింపులు ఎన్నికల తర్వాత అభివృద్ధిపైనే దృష్టి పెట్టాలని అన్నారు. ప్రజాదర్బార్ పెట్టి కామారెడ్డి మున్సిపల్‌లో తీర్మానం చేస్తే కామారెడ్డి పట్టణాన్ని కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. కామారెడ్డిలో జరుగుతున్న అభివృద్ధిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు తప్ప ఏమి చేయలేకపోతున్నారని దీంతో కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధిలో 10 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోతుందని అన్నారు. నియోజకవర్గంలో పని చేయడానికి అధికారులు ఎవరు ముందుకు రావడం లేదని ఇక్కడ పని చేస్తున్న అధికారులు వేరే దిక్కు వెళ్లిపోతున్నారని అన్నారు. కామారెడ్డి పట్టణానికి ప్రత్యేక నిధుల ద్వారా రూ.240 కోట్లతో జలాల్‌పూర్ నుంచి మల్లన్నగుట్ట వరకు తాగునీరు పైప్‌లైన్‌ల కోసం నిధులు మంజూరు చేశామని, మున్సిపాలిటీకి అమృత్‌స్కీం కింద రూ.93 కోట్ల పనులకు టెండర్లు పూర్తి చేశామని తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గానికో



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

సాగు నీటి కోసం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పథకం కింద రూ.1200 కోట్లు అవసరముండగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.200 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. దీని ద్వారా రూ.2,54,000 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. త్వరలోనే ప్రత్యేక నిధుల ద్వారా 133/11 సబ్‌స్టేషన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ కామారెడ్డి పట్టణ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని ముఖ్యంగా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. సాధ్యమైనంత వరకు కేంద్రం నుంచి కొట్లాడి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని తెలిపారు.

ఆగ్రో బయో ప్రాడక్ట్స్ ద్వారా యువతకు ఉపాధి

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

సదాశివనగర్, ఆగస్టు 31: వివేక్ ఆగ్రో బయో ప్రొడక్ట్ ద్వారా లింగంపల్లి యువతకు సుమారు 2వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. లింగంపల్లి శివారులో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ ప్రాంతంలో మొట్ట మొదటిసారిగా వివేక్ ఆగ్రో బయో ప్రొడక్ట్ కంపెనీ నిర్మాణానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పాలనలో పేదలకు అసైన్‌మెంట్ భూములు అందజేసి గత ప్రభుత్వంలో నిర్వాసితులను పట్టించుకోకుండా పరిశ్రమల జోన్‌గా ఏర్పాటు చేసి పనులు ప్రారంభించిన దృష్ట్యా పేదలకు అన్యాయం జరగకూడదని గతంలో పోరాటం ద్వారా పట్టాలు ఉన్నవారికి ఇతర ప్రాంతాల్లో భూమిని పంచి ప్రస్తుతం పరిశ్రమలు ప్రారంభించడం గొప్ప విషయమని అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఇలాంటి మరెన్నో పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధితో పాటు కూలీలకు జీవనోపాధి కల్పించడం ఏకైక లక్ష్యంగా ఎంచుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. బయో ప్రొడెక్ట్ కంపెనీ ప్రారంభంతో మిగిలిన కంపెనీలు ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు పోటీ పడడంతో ఈ ప్రాంతం అతి త్వరలోనే విలువైన ప్రాంతంగా ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో కూడా ఎంప్లాయిమెంట్ కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యమని దాని ప్రకారం ఇక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసిన వివేక్ ఆగ్రో కంపెనీకి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రంగనాథ్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంఈవో యూసఫ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగారెడ్డి, లింగాగౌడ్, ఇర్షద్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్


లెండికి మోక్షం కలిగేనా?

మద్నూర్, ఆగస్టు 31: కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, డోంగ్లి, బిచ్కుంద, మండల రైతులు 37 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న లెండి ప్రాజెక్టు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇటీవల జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మహారాష్ట్రలో నిర్మిస్తున్న లెండి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి ఈ ప్రాంతం రైతులకు లెండి ప్రాజెక్టు నీరు అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ప్రాజెక్టు నిర్మాణానికి 1984లో అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి కీర్తి శేషులు ఎస్‌బీ చౌహన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కీర్తి శేషులు ఎన్టీ రామారావుల మధ్య లెండి ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పందం కుదిరింది. అప్పట్లో లెండి నిర్మాణానికి అయ్యే మొత్తం నిర్మాణ వ్యయంతో మహారాష్ట్ర 62 శాతం ఆంధ్రప్రదేశ్ 38శాతం నిధులు ఖర్చు చేసే విధంగా ఒప్పందం చేసుకున్నారు. 1984లో అంచనా వ్యయం 54.55 కోట్ల రూపాయలు కాగా 2003 నాటికి లెండి ప్రాజెక్టు నిర్మాణ వ్యయం 275.84 కోట్లకు చేరింది. 1987లో ప్రాజెక్టు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. 2012-13 అంచనా ప్రకారం రూ.1038 కోట్లకు చేరుకుంది. ఆ లెక్కన ఇరు రాష్ట్రాల వారు రూ.355.19 కోట్లు వెచ్చించి 70 శాతం పనులను పూర్తి చేశారు. 30 శాతం పనులు మిగిలిపోగా మహారాష్ట్రలోని 12 గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించి ఆ గ్రామాల నుంచి లెండి కాలువ పనులు చేపట్టాల్సి ఉంది. కానీ 12 గ్రామాల ప్రజలు తమకు రావాల్సిన డబ్బు రాలేదని కాలువ పనులను అడ్డుకోవడంతో గత 12 సంవత్సరాలుగా ఎటువంటి పురోగతి జరగడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మహారాష్ట్రలోని లెండి ప్రాజెక్టు నిర్మిస్తున్న ఏరియాను పరిశీలించి తమ వెంట అధికారులను తీసుకెళ్లి అంచనా వేశారు. ఆయన అంచనా ప్రకారం 30 శాతం పనులు పూర్తయినట్లయితే రాబోయే ఏడాది లోగా నియోజకవర్గంలోని రైతులకు సాగు నీరు అందుతుందని భరోసా ఇచ్చారు. ఇప్పటి వరకు తెలంగాణలోని జుక్కల్ నియోజకవర్గంలో మద్నూర్, బిచ్కుంద మండలాల రైతుల నుంచి లెండి మెయిన్ కాలువ కోసం 650 ఎకరాల భూ సేకరణ జరిగింది. రైతులకు రూ.7.50 కోట్ల నష్ట పరిహారం అందజేశారు. రైతుల నుంచి భూమిని సేకరించిన అనంతరం లెండి కాలువ నిర్మాణం కోసం రూ.43 కోట్లు కేటాయించారు. 20 కోట్లు ఖర్చు చేసి 25 కిలో మీటర్ల లెండి కాలువ తవ్వించారు. వీటిలో 40 వంతెనలు నిర్మించాల్సి ఉండగా 28 వంతెనల నిర్మాణం పనులు పూర్తి చేశారు. ఆ తరువాత లెండి ప్రాజెక్టు పనులు నిలిచిపోవడంతో ఎటువంటి పురోభివృద్ధి కనిపించలేదు. గత ప్రభుత్వం సైతం లెండి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ పనులు పూర్తికాకుండానే అధికారం నుంచి వైదొలిగారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెప్పుకోవడంతో ఆ ప్రాంతం రైతులు తమకు లెండి ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అంది 25 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని ఆశిస్తున్నారు. లెండి ప్రాజెక్టు పూర్తయినట్లయితే మద్నూర్, డోంగ్లి, బిచ్కుంద మూడు మండలాల్లో రైతులు వర్షాధారంపైన ఆధారపడకుండా 25 వేల ఎకరాల్లో పంటలు పండించుకోగలుగుతారు.



పనులు నిలిచిపోయిన లెండి ప్రాజెక్టు

- గత 12 ఏళ్లుగా నిలిచిపోయిన పనులు
- జుక్కల్ ఎమ్మెల్యే పర్యటనతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



గతంలో సుదర్శన్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో సందర్శించిన దృశ్యం



ఇటీవల జుక్కల్ ఎమ్మెల్యే లెండి పనులను పరిశీలించిన దృశ్యం

విద్యారంగంలో జిల్లా వెనుకబాటు: విద్యార్థి సంఘాలు

నిజామాబాద్‌అర్బన్, ఆగస్టు31: విద్యారంగంలో జిల్లా వెనుకబాటుకు గురైందని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యార్థి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశానికి ఏఐఎస్ ఎఫ్, టీవీయూవీ, టీజీవీపీ, ఏబీవీఎస్‌యూ సంఘాల నాయకులు బానుచందర్, లాల్‌సింగ్, బోడ అనీల్, రఘురాం, తదితరులు హాజరై మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా నిజామాబాద్ జిల్లా విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టడం లేదని విద్యావ్యవస్థలో అనేక సమస్యలు ఉన్నప్పటికి వాటిని పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాలు మారిన జిల్లాకు కొత్తగా విద్యాసంస్థలు కేటాయించకపోవడం జిల్లాను నిర్లక్ష్యం చేయడమేనన్నారు. జిల్లాలో బీ టెక్ కళాశాల ఏర్పాటుచేస్తామని పనులు కూడా మొదలుపెట్టి నిధుల కేటాయింపులో జాప్యం చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం కేవలం కుటుంబ పాలనకే పరిమితమైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు వెటర్నరీ కళాశాల కేటాయించాలని, ఫార్మ కళాశాల కూడా కేటాయించాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా జిల్లాకు పలుమార్లు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు కళాశాలలు కేటాయిస్తామని చెప్పారని అదేవిధంగా కేటాయించాలన్నారు. జిల్లాకేంద్రంలో ఉమెన్స్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నగేష్, తదితరులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

'చలో విద్యుత్ సౌధా మహాధర్నాను విజయవంతం చేయండి'

సుభాష్‌నగర్, ఆగస్టు 31: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చలో విద్యుత్‌సౌధా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉద్యోగజేఏసీ చైర్మన్ సురేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగారంలో గల అసోసియేట్ బిల్డింగ్‌లో తెలంగాణ విద్యుత్ ఓసీ, బీసీ ఉద్యోగుల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలో విద్యుత్ సౌదా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈ వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో అన్ని క్యాడర్‌లలో నేరుగా నియమించబడ్డ ఉద్యోగుల సీనియారిటీలను మెరిట్ ఆధారంగా పదోన్నతులు కల్పించాలన్నారు. నష్టపోయిన ఓసీ, బీసీల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోచైర్మన్ శ్రీనివాస్‌రావు, కన్వీనర్ రమణ, కోకన్వీనర్ శ్యామ్, డిఈలు ఆరోగ్యరాజ్, సత్యప్రకాశ్, ఏడీఈలు తోటరాజశేఖర్, రాజేందర్, శ్రీనివాస్, ఆనంద్‌రాజ్, బిసి నాయకులు హరికృష్ణ, కాశీనాథ్, సునీత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్

యూనివర్సిటీకి వీసీని నియమించాలి

● బీజేవైఎం నాయకులు డిమాండ్

డిచ్‌పల్లి, ఆగస్టు31: తెలంగాణ యూనివర్సిటీ రెగ్యూలర్ వైస్‌చాన్స్‌లర్‌ను నియమించాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన తెలంగాణ వర్సిటీలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వీసీ లేక వర్సిటీ పాలన కుంటుపడిందని, విద్యార్థులు అసౌకర్యాలకు గురి అవుతున్నారని కాలయాపన చేయకుండా రెగ్యూలర్ వీసీని ప్రభుత్వం నియమించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రబడ్జెట్‌లో వర్సిటీకు నిధులు కేటాయించకపోవడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యపై ఎంత మక్కువ ఉందో తెలిసిపోయిందని విమర్శించారు. సమావేశంలో తరుణ్, నవీన్, సాయిపవన్, అనురాగ్, విఘ్నేశ్, పాల్గొన్నారు.

టీయూలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

డిచ్‌పల్లి, ఆగస్టు31: పెండిగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడం సిగ్గుచేటని అని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. పీడీఎస్‌యూ టీయూ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. రాజేశ్వర్ మాట్లాడుతూ పేద బడుగుబలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. పేద విద్యార్థులను విద్యకు దూరం చేయాలనే కుట్ర జరుగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్‌ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూ పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్, రవీందర్, గోపి, రాకేశ్, బాలాజీ, భరత్,మణికంఠ, నితిన్, దర్శు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ అమలు చేయాలి'

ముప్కాల్, ఆగస్టు31: ఎలక్షన్ మెనిఫెస్టోలో వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా కంట్రిబ్యూటర్ పెన్షన్ స్థానంలో పాత పెన్షన్ అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న భగవాన్‌దాస్ సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రాథమికపాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్‌ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్, పాఠశాల హెచ్‌ఎం గంగారాం, తెలంగాణప్రాంత ఉపాధ్యాయసంఘం జిల్లాఅధ్యక్షురాలు కృష్ణవేణి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పడకల్ విద్యార్థుల ఎంపిక

జక్రాన్‌పల్లి, ఆగస్టు31: రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు జక్రాన్‌పల్లి మండలం పడకల్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు గడ్డంశ్రీనివాస్ తెలిపారు. ఆర్మూర్‌లో ఆగస్టు 28న జరిగిన సబ్ జూనియర్ జిల్లా టెన్నికాయిట్ పోటీల్లో ఉత్తమప్రతిభ కనబర్చిన 8వ తరగతి చదువుతున్న చందన, నరేష్ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఆర్మూర్‌లో సెప్టెంబర్ 1, 2, 3తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలి



నగరంలో ఐక్యతను చూపిస్తున్న ఉద్యోగులు

సుభాష్‌నగర్, ఆగస్టు 31:ప్రతియేటా సెప్టెంబరు 1న నిర్వహించే పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఉద్యోగ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయంలో వివిధ ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు డిమాండ్‌తో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగితో పాటు ఓపీఎస్ ఉద్యోగులందరు అధిక సంఖ్యలో హాజరై నిరసన వ్యక్తం చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉద్యోగుల గళం గట్టిగా చేరవేసి హక్కుల సాధన కోసం పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంగం అమృత్‌కుమార్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, టిఎన్‌జీవోస్ కార్యదర్శి నేతికుంట శేఖర్, పిఆర్‌టియు అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ రెడ్డి, వెంకన్న, టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, టిపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

పెద్దబజార్, ఆగస్టు 31: రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని అర్హులందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యవసర సరుకుల ధరలు తగ్గించకపోవడంతో ప్రజలపై మరింత భారం పెరుగుతుందని అన్నారు. 2021లో నిర్వహించాల్సిన జనాభా లెక్కలు నిర్వహించకపోవడంతో కొత్త రేషన్‌కార్డుల జారీ రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిందని, ఆశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశించిన రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, మరోవైపు రేషన్ కార్డు లు ఉన్న వారందరూ సెప్టెంబరు 30లోపు తమ ఆధార్ ఈకెవైసీని అనుసంధానం చేసుకోకపోతే రేషన్ కార్డులు రద్దు అవుతాయని ప్రభుత్వం ప్రకటించిందని దీనివల్ల అనేక మంది ఇతర ప్రాంతాలకు వలస పోయిన కూలీలు కార్మికులు రేషన్ కార్డులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఈకెవైసీ నిబంధనలు రద్దు చేయడంతో పాటు జనాభా లెక్కలు పూర్తి చేసి అర్హులైన పేదలందరికి రేషన్ కార్డు లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబరు 2న ధర్నా చౌక్ వద్ద ఉదయం 11గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు విఠల్‌గౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'వైద్య సిబ్బందిని నియమించండి'

పెద్దబజార్, ఆగస్టు 31: రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలో వైరల్ ఇన్ఫెక్షన్, డెంగ్యూ జ్వరాల వల్ల ఇటీవల కాలంలో అనేక ప్రజలు మృత్యువాత పడుతున్నారని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని సుభాష్‌నగర్‌లోగల బిఎల్‌ఎఫ్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డాక్టర్, సిబ్బంది నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి జిల్లా, మండల, గ్రామ పంచాయతీ పరిధిల్లో హెల్త్, రెవెన్యూ ఇతర ప్రభుత్వ శాఖలతో పాటు ప్రైవేటు డాక్టర్స్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృతమైన హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు యుద్ధప్రాతిపదికన చికిత్సలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు సబ్బనిలత, నగర కార్యదర్శి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ, సంస్కారం అలవర్చుకోవాలి : ఏసీపీ

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు31: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సంస్కారం అలవార్చుకోవాలని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చేపూర్ క్షత్రీయ పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆర్మూర్ మండల స్థాయి రూరల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఓటమికి నిరుత్సహ పడకుండా గెలుపుకోసం ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు చదువులో లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేసినప్పుడు విజయం మీ సొంతమవతుందన్నారు. తహసీల్దార్ గజానంద్ మాట్లాడుతూ ఆటలలో గెలుపు, ఓటమిలు సహజమని, నేటి ఓటమి రేపటి గెలుపునకు నంది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజగంగారాం, క్షత్రీయ కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, క్రీడల కన్వీనర్ చేతనకుమారి, కోకన్వీనర్ లక్ష్మీనర్సింహస్వామి, గంగాధర్, బ్రిజేష్, వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ బస్వారెడ్డి

● పోటీలో విజేతలు వీరే..

మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడల్లో జూనియర్ కబడ్డి విభాగంలో ఇస్సాపల్లి ప్రథమ, మగ్గిడి ద్వితీయ, బాలుర ఖోఖోలో ఫత్తేపూర్ ప్రథమ, టీజీడబ్ల్యుఆర్ఎస్ పిప్రి ద్వితీయ, బాలికల కబడ్డి విభాగంలో మగ్గిడ్డి పాఠశాల ప్రథమ, పిప్రి ద్వితీయ, వాలీబాల్ విభాగంలో మగ్గిడి ప్రథమ, చేపూర్ ద్వితీయ బహుమతులు సాధించారు. సబ్‌జూనియర్ కబడ్డీలో బాలుర కబడ్డీలో క్షత్రీయ ప్రథమ, మంథన ద్వితీయ, ఖోఖోలో గురుకుల పిప్రి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ పిప్రి ద్వితీయ బహుమతులు సాధించారు.

ఎమ్మెల్యే సహకారంతో పట్టణ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బోధన్‌రూరల్,ఆగస్టు31: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి అన్నారు. శనివారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 37ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. డ్రింకింగ్ తాగునీటి సమస్య పరిష్కారం కోసం 46లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి 1.50లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆమె పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. బోధన్ మున్సిపాలిటీని తెలంగాణలోనే ఎమ్మెల్యే సహకారంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణలతో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

'భజన మండలి సాధన శిబిరాన్ని విజయవంతం చేయండి'

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 31: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలో ఆదివారం నిర్వహించనున్న భజన మండలి సమన్వయ కర్తల సాధనా శిబిరాన్ని విజయవంతం చేయాలని సత్యసాయి సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. శిబిరం జిల్లా కేంద్రంలోని సత్యసాయి మందిరంలో ఉంటుందని అన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వివిధ అంశాలపై చర్చ జరుగుతోందని జిల్లా నలుమూలల నుంచి సాధనా శిబిరానికి భజన మండలి నిర్వాహకులతో పాటు సత్యసాయి కమిటీ రాష్ట్ర నాయకులు పాల్గొంటారని అన్నారు.

పాలెం ప్రభుత్వ పాఠశాల తనిఖీ



పాలెంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మండల నోడల్ అధికారి

మోర్తాడ్, ఆగస్టు31: మండలంలోని పాలెం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మండల నోడల్ అధికారి సమ్మిరెడ్డి తనిఖీ చేశారు. ప్రతీ తరగతి గదుల్లోకి వెళ్లి పిల్లల సామర్థ్యాలను, వారికి రాసిన పరీక్షల గురించి, బెస్‌లైన్ టెస్ట్, ఎల్‌ఐపీ, ఎఫ్‌ఏ-1 పరీక్షల గురించి విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం జరిపి ప్రతీ ఉపాధ్యాయులు ప్రతీరోజు లెసన్‌ప్లాన్ రాయాలని, యూనిట్ ప్లాన్ రాయాలని, ఇయర్ ప్లాన్‌లను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రావు, మహేష్‌కుమార్‌గౌడ్, చంద్రశేఖర్, నర్సింహస్వామి, రాజేంధర్, బెస్సీ, త్రివేణి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

ఎడపల్లి, ఆగస్టు31: ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మండల పంచాయతీ అధికారి మన్‌మోహన్ శర్మ సమావేశమై సీజనల్ వ్యాధుల నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డెంగీ వ్యాధి విజృంభిస్తున్న తరుణంలో గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. డెంగీవ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే మెడికల్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఆయా జీపీల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.



పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

నవీపేటలో మినీ ట్రక్ చోరీ



నవీపేట మేకల సంతలో చోరీకి గురైన మినీ ట్రక్ వాహనం

నవీపేట,ఆగస్టు31: నవీపేటలో శనివారం జరిగిన మేకల సంతకు వచ్చిన అశోక్ లేలాండ్‌కు చెందిన మినీట్రక్ వాహనం చోరీకి గురైంది. బోధన్‌కు చెందిన మేకల వ్యాపారులు హర్షద్, ముజాయిత్ అనే అన్నదమ్ములు తెలిపిన ప్రకారం గల అశోక్ లేలాండ్ మినీట్రక్ వాహనం నవీపేటలోని రాంపూర్ వెళ్లే రహదారి పక్కన నిలిపి ఉంచగా గుర్తు తెలియని దొంగ అపహరించాడని వారు పేర్కొన్నారు. వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి ఉంచి తాము సంతలోకి వెళ్లి తిరిగి వచ్చే సరికి వాహనం మాయమైందని పక్కనే దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని దొంగ మారు తాళం చెవితో వాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాలో నమోదైందని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని బాధితులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ వినయ్‌ని వివరణ కోరగా వాహనం చోరీ అయిన మాట నిజమేనని అన్నారు. ఇదిలా ఉండగా చోరీకి గురైన వాహనం మహారాష్ట్రలోని ముద్‌ఖేడ్‌లోని పెట్రోల్ బంక్‌లో సంబంధిత వాహనంలో డీజిల్‌లో పోస్తున్నట్లు అక్కడి సీసీ కెమెరాలో కూడా నమోదైందని బాధితులు వివరించారు.

పలు వార్డుల్లో బీజేపీ సభ్యత్వంపై అవగాహన

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు31:పట్టణంలోని పలువార్డుల్లో బీజేపీ సభ్య త్వంపై జిల్లాసభ్యత్వ కన్వీనర్ పుప్పాలశివరాజ్‌కుమార్ శనివారం శక్తికేంద్ర ఇన్‌చార్జీలకు, నాయకులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా 47, 48,49,50బూత్‌లలో సమావేశం నిర్వహించి పార్టీసభ్యత్వంపై అవగాహన కల్పించి ఆన్‌లైన్ ద్వారా ఫోన్‌నెంబర్ 8800002024నెంబర్‌కు మిస్‌కాల్ ద్వారా సభ్యత్వం పొందవచ్చునని వివరించారు.ఈ కార్యక్రమంలో శక్తికేంద్రాల ఇన్‌చార్జి పొల్కంవేణు,బీజేపీనాయకులు కృష్ణగౌడ్, శశాంత్, శివరాంరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఖిల్లా, ఆగస్టు 31: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని ఐదో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాగారంలో శనివారం జరిగింది. నాగారంకు చెందిన ఖాలేఖ్‌బిన్ అబ్దుల్లా (48) ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ గురయ్యాడు. మృతుడు నాగారంలో ఓఇంటిలో ఫ్యాన్‌రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. గంగాధర్ తెలిపారు. మృతుడికి ముగ్గురు సంతానం ఉన్నారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించాలని వినతి

ఎడపల్లి, ఆగస్టు31: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలోని రాజీవ్ నగర్ కాలనీ వాసులు తమ కాలనీలో ఉన్న ప్రాణాంతకమైన కోనో కార్పస్ చెట్లను తొలగించాలని శనివారం గ్రామ పంచాయితీ కార్యదర్శి ప్రేమ్‌దాస్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్టుపై పక్షి కూడా వాలని కోనో కార్పస్ చెట్లను కాలనీలో నాటారని వాస్తవానికి ప్రతీ చెట్టు కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకుని ఆక్సిజన్‌ను వదులుతాయని, కానీ కోనో కార్పస్ చెట్టు మాత్రం ఆక్సిన్‌ను తీసుకుని కార్బన్ డై ఆక్సైడ్‌ను వదులుతాయని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలిందని, అలాంటి ప్రాణాంతకమైన చెటను తొలగించాలని వారు కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రాజీవ్ నగర్ కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

బోధన్‌రూరల్,ఆగస్టు31: బోధన్ మండలంలోని మంజీర సరిహద్దు గ్రామాల నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ప్రభుత్వం నియమ, నిబంధనలను తప్పకుండా ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ

సుభాష్‌నగర్, ఆగస్టు 31: టీజీఎన్‌పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా ఎరుకల నారాయణ పదవీబాధ్యతలు స్వీకరించారు. నగరంలోని పవర్ హౌజ్ కంపౌండ్ కార్యాలయంలో నూతనంగా నియమించబడ్డ నారాయణ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్, సిరిసిల్లా, జగిత్యాల జిల్లాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించే విధంగా సీజీఆర్ఎఫ్ పనిచేస్తుందని అన్నారు. నూతన సీజీఆర్ఎఫ్ చైర్మన్‌ను ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సభ్యులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్‌ను కలిసిన వారిలో చీఫ్ ఇంజనీర్ రామకృష్ణ, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ నాంపల్లి, డీఈలు, ఏడీఈలు ఉత్తమ్, అశోక్, నాగరాజు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

కోటగిరి,ఆగస్టు 31: రెండు రోజుల పాటు భారీ నుంచి, అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొతంగల్ తహసీల్దార్ మల్లయ్య సూచించారు. పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పాత ఇళ్లలో ఉండరాదని సూచించారు. మంజీర పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రెండు రోజుల పాటు ఎలాంటి ప్రయాణాలు పెట్టుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాయిలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలి

● అడిషనల్ కలెక్టర్

డిచ్‌పల్లి, ఆగస్టు 31:గ్రామ పంచాయతీల ఓటర్ లిస్టును పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పకడ్బందీగా తయారు చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం దోమకొండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఓటర్ జాబితా ప్రక్రియను ఆయన పరిశీలించారు.అదే విధంగా మండలంలో జరుగుతున్న ఎల్ఆర్ఎస్ సర్వేను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు వహించాలని కార్యదర్శులకు ఆదేశించారు.అడిషనల్ కలెక్టర్‌ను మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు రమేష్, అంజయ్య, శ్రీనివాస్,స్నేహ, పద్మ, వసంత, శ్రీనివాస్, సౌందర్య, శ్రీకాంత్, కిషన్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బీటీఎస్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని వినతి

దోమకొండ, ఆగస్టు 31:దోమకొండ, దుబ్బాక, సిద్దిపేటకు వెళ్లేందుకు జాతీయ రహదారి అయిన బీటీఎస్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ శనివారం ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీకి దోమకొండ మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వినతిపత్రం అందజేశారు. దోమకొండ వైపు నుంచి రాకపోకలు సాగించే భారీ వాహనాలు, ఆర్టీసి బస్సులు అంతంపల్లి టోల్‌గేట్ వద్ద యూటర్న్ తీసుకుని రావాల్సివస్తుందని అందువలన దూరభారంతో పాటు డీజిల్ వృధ అవుతుందన్నారు. బ్రిడ్జి నిర్మాణం చెపడితే ప్రజలకు రవాణా సౌకర్యం సులువుగా ఉంటుందని వినతిపత్రంలో పెర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం చెపట్టేలా కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, పట్టణధ్యక్షులు సీతారాం మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

పెద్దకొడప్‌గల్, ఆగష్టు 31: జుక్కల్ మండల కేంద్రంలో గల ప్రయివేట్ ఆసుపత్రులలో వైద్యం చేసే పీఎంపీ, ఆర్ఎంపీ వైద్యులు తమ స్థాయికి మించిన వైద్యం చేస్తే చర్యలు తీసుకుంటామని మండల వైద్యాధికారి విఠల్ హెచ్చరించారు, శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో గల పీఎంపీ, ఆర్ఎంపీలు చికిత్స చేసే ఆసుపత్రులను తనిఖీ చేశారు, ఈ సందర్భంగా వైద్యాధికారి విఠల్ మాట్లాడుతు ప్రస్తుతం ఆయా గ్రామాలలో వైరల్ పీవర్ వస్తున్నందున తమ రోగులకు భయపెట్టి అవసరం ఉన్న లేకున్న లేని పోని పరీక్షలు చేయించుకోవాలంటూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారని తమకు పిర్యాదులు అందాయని తెలిపారు. అంతేగాక వీరు ఆసుపత్రులలో బెడ్లు ఏర్పాటుకు అనుమతి లేకున్న ఆసపత్రులలో బెడ్లు ఏర్పాటు చేసుకుని మోతాదుకు మించిన మందులు ఇవ్వడం, స్టెరాయిడ్స్, ఐవి ప్లూయిడ్స్ పెట్టడం లాంటివి నిబంధనలకు విరుద్దంగా చేస్తున్నారని తెలిపారు. ప్రథమ చికిత్స కాకుండా కార్పోరేట్ స్థాయిలో వైద్యం చేసిన ఆసుపత్రులకు త్వరలో షోకాజ్ నోటీసులు అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు విక్రం, శశి, మోగేష్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిరూరల్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్‌కాలనీలో ఉన్న ప్రైవేట్ పీఎం పీ, ఆర్ఎంపీ ఆసుపత్రులను దేవునిపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.జోహ ముజీబ్ తనిఖీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జ్వరం ఉన్న లేకున్నా నార్మల్ చెకప్ కోసం వచ్చే వారికి ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలి, వారికి సైలన్ ఎక్కించడం, ట్రీట్‌మెంట్‌ల వంటివి చేయవద్దని అవసరమైతే వారిని దగ్గరలో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు.

నాగిరెడ్డిపేట : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లను శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు సృజన్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. ఆర్ఎంపీ, పీఎంపీలు తమ క్లినిక్‌లకు వచ్చే రోగులకు కేవలం ప్రాథమిక చికిత్సలు మాత్రమే చేయాలని ఆయన తెలిపారు. ఇంజక్షన్లు గాని హైడ్రోస్ మందులు గాని రోగులకు ఇవ్వద్దని, గ్లూకోస్‌లు రోగులకు ఎక్కించోద్దని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. క్లినిక్‌లలో గ్లూకోస్‌లు గాని, హైడోస్ ఇంజక్షన్ గాని, యాంటి బేటిక్ మందులు ఇస్తున్నట్లు తెలిసే అలాంటి క్లినిక్‌లపై వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటు చేయాలని వినతి

భీమ్‌గల్, ఆగస్టు31: భీమ్‌గల్ మండల కేంద్రానికి మంజూరైన కోర్టును ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్‌కు వినతిపత్రం అందజేశారు. 2007 సంవత్సరంలో గజిట్ నోటిఫికేషన్‌తో భీమ్‌గల్‌కు మంజూరైన కోర్టు కొన్ని అనివార్య కారణాల వల్ల ఆర్మూర్‌లో ఏర్పాటు చేశారని, దీంతో ఇక్కడి ప్రాంత ప్రజలు ఆర్మూర్ కోర్టుకు వెళ్ళాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు సమయానికి చేరుకోలేక పోతున్నారని కనుక అన్ని అర్హతలు కలిగి ఉన్న భీమ్‌గల్ మున్సిపాలిటీలో కోర్టు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. వినతి పత్రం అందించిన వారిలో అధ్యక్షుడు చెవ్వ అశోక్, ఉపాధ్యక్షుడు గంగాదాస్, సభ్యులు లింబాద్రి, నర్సయ్య, సత్యనారాయణ, నవీన్, గంగాధర్, రంజిత్, వకిల్, చైతన్య, తదితరులు ఉన్నారు.

మోతె పాఠశాలకు బీరువా, కుర్చీలు వితరణ

వేల్పూర్, ఆగస్టు31: మండలంలోని మోతె గ్రామ ఉన్నత పాఠశాలకు అక్లూర్ గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి, గ్రామాభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు జిన్న ప్రభాకర్ శనివారం డబుల్ డోర్ బీరువ, పది ఎస్.టాప్ కూర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా జిన్న ప్రభాకర్ పాఠశాల తరఫున ప్రధానోపాధ్యా యు డు వైద్య గణేష్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాలకు పూర్వవిద్యార్థుల సహకారం ఎల్లవేళల ఉండాలని హెచ్ఎం గణేష్ కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు మండల ప్రధానకార్యదర్శి సీవీ.నర్సింహరావు, ఉపాధ్యాయులు కృష్ణవేణి, గణేష్, మహేంధర్, రత్నయ్య, కవిత, శ్రావణ, లలిత, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సాధికారత కోసం ప్రత్యేక పథకాన్ని ప్రకటించాలి

● ఎంపీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

బోధన్‌రూరల్,ఆగస్టు31: వికలాంగుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా 3వ మహసభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య మాట్లాడుతూ దేశంలో సరైన తిండి లేక అనేక మంది అల్లాడుతుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జీఎస్టీ తీసుకువచ్చి ప్రజలపై భారం వేసి సంపన్నులకు లక్ష కోట్ల రాయితీ ఇచ్చే హక్కు మోడీకి ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రధానమంత్రి అవాస్ యోజన కింద రాష్ట్రంలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. 10లక్షల ప్రాథమిక ఉప వైద్య కేంద్రాలు ఉండాల్సిన చోట కేవలం లక్ష 46కేంద్రాలతో అందరికి వైద్యం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇంకా రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ నిరుద్యోగులకు కేంద్రం మోసం చేస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో వికలాంగులపై దాడులు మహిళలపై లైంగిక వేధింపులు, ఆత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. వికలాంగులు దుర్భరమైన స్థితిలో ఉన్నారని, వికలాంగుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, ఎంపీఆర్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బస్వరాజ్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఏశాల గంగాధర్, నాయకులు గంగాధరప్ప, సిర్ప లింగం, గంగాధర్, కవిత, గైని రాములు, రాంపటేల్, నజీమ్, సాయమ్మ, నాగమణి, లక్ష్మణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి

లారీ ఢీకొని ఎంబీఏ విద్యార్థి మృతి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 31: కమ్మర్‌పల్లి మండలకేంద్రం శివారులోని పాటిహనుమాన్ వద్ద శనివారం సాయంత్రం .జరిగిన రోడ్డుప్రమాదంలో ఎంబిఏ పూర్తచేసిన విద్యార్థి సుంకెట రవి మృతిచెందాడు. కుటుంబసభ్యుల వివరాలు ఇలాఉన్నాయి. ఆస్ట్రేలియాలో ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషనలో ఉన్నాడు. అయితే 40 రోజుల సెలవుపై 15 రోజుల క్రితం స్వగ్రామం కమ్మర్‌పల్లికి వచ్చిన రవి శనివారం పాటిహనుమాన్ ప్రాంతంలో తన స్నేహితులతో కలిసి పార్టీచేసుకున్నాడని తెలిసింది. సాయంత్రం ఇంటికి బైక్‌పై తిరుగు ప్రయానమైన రవిని ఎదురుగా వస్తున్న లాడి ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై అపస్మారకస్థితిలో వైద్యచికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స నందిస్తు ఆర్మూర్‌లోని ప్రైవేటు అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మరణించాడు. మృతిని తండ్రి 12 ఏళ్లక్రితం ఆనారోగ్యంతో చనిపోగా తల్లి సంరక్షణలో ఉన్నాడు. మృతునికి ముగ్గురు అక్కలు ఉన్నారు. ఒక్కగానొక్క కోడుకు మరికొద్దిరోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా మృత్యువు వెంటాడంతో కుటుంబసభ్యుల, సన్నిహితుల రోదనలు మిన్నంటాయి. కాగా శనివారం సాయంత్రం కుంటుంబసభ్యుల స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసున మోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టంకై పంపి దర్యాప్తు చేస్తున్నట్లు కమ్మర్‌పల్లి ఇన్‌చార్జ్ ఎస్సై విక్రం తెలిపారు.

మారుతీ మందిరంలో ప్రత్యేక పూజలు



బోధన్ మారుతీ మందిర్‌లో అన్నదానం చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు31: బోధన్ పట్టణంలోని మారుతీ మందిరంలో శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా మారుతీ మందిరంతో పాటు చావిడి హనుమాన్ మందిరం, తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాస చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వేద పండితులు ప్రవీణ్ మహరాజ్, ఉదయ్ మహరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, దేవాదాయ శాఖ సిబ్బంది రాములు,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

బోధన్‌రూరల్,ఆగస్టు31: సాలూర మండలంలోని హున్స ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలని శనివారం గ్రామస్థులు బోధన్ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్ మాట్లాడుతూ హున్స గ్రామంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను విడిగా ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కోరడం జరిగిందన్నారు.త్వరలోనే ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపుతామని తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఈరయప్ప మహరాజ్, షమీ శంకర్, షికారి నారాయణ, నాని, వల్లకొండ, శివకుమార్, మాజీ ఎంపీటీసీ ప్రకాష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్ సొసైటీలో రైతులకు రుణాల అందజేత

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు31: ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం 37మంది రైతులకు రూ.39లక్షల 38వేల నూతన స్వల్ప కాలిక పంట రుణాలను చైర్మన్ తంబురి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్‌లు బార్ల సంతోష్‌రెడ్డి, కల్లెం సాయిరెడ్డి, గోవర్ధన్, కల్లెం బోజారెడ్డి, ప్రమోద్‌కుమార్, మల్లూబాయి, ఆరే రాజేశ్వర్, వెల్మ నర్సారెడ్డి, గంగాధర్, పచ్చుకల లసుంబాయి, సంఘ కార్యదర్శి తొర్తి మల్లేష్, సిబ్బంది ముత్యం,దేవరాజ్,గంగాధర్, రాజు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మోర్తాడ్, ఆగస్టు31: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టూడెంట్స్ టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రాగ్స్ సేవించరాదని, శారీరక, మానసిక ఆరోగ్యంతో అనుకున్న లక్ష్యాలను సాధించుటకు అలుపెరగని కృషి చేయాలని అన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నందిపేట , ఆగస్టు 31: నందిపేట మండలంలోని కొల్‌పూర్ గ్రామ శివారులో ఉన్న రైతుఫారంలో ఉన్న డంపింగ్‌యార్డులో పేకాట ఆడుతున్న స్థావరంపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు పేకాట స్థావరంపై దాడి చేశారు. సుమారు రూ.11వేల 120 నగదు, మూడు ఫోన్‌లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.



పాల్గొన్న పోచారం

భక్తి మార్గం ద్వారానే ఫలితాలు

● వ్యవసాయ సలహాదారుడు పోచారం

బాన్సువాడటౌన్, ఆగస్టు 31 : భక్తిమార్గం ద్వారానే ఫలితాలు వస్తాయని వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శ్రావణమాసం ఆఖరి శనివారం పురస్కరించుకుని పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్చకులు ఆలయంలో ప్రత్యేకపూజలు చేపట్టారు. ఉదయం 11 గంటలకు దంపతులు కలిసి సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పాల్గొని పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, భక్తులున్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపాదాస్ మున్షిని కలిసిన పోచారం

బాన్సువాడ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షిని శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. వ్యవసాయ సలహాదారు నియామకానికి సహకరించిన దీపాదాస్ మున్షికి శాలువా, పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదలు తెలిపారు. త్వరలోనే జరిగే బాధ్యతల స్వీకార కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరు కావాలని మున్షిని ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

ఓటర్లకు అసౌకర్యాలు కలుగకుండా చూడాలి

నసురుల్లాబాద్, ఆగస్టు 31: త్వరలో రానున్న గ్రామపంచాయతీ ఎలక్షన్ ఎన్నికల దృష్ట్యా గ్రామాలలో పోలింగ్ బూత్‌లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ అన్నారు. శనివారం మండలంలోని మైలారం, నసురుల్లాబాద్, బొప్పస్‌పల్లి, లింగంపల్లి తండా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఆయన అధికారులతో కలిసి పర్యవేక్షించారు.

మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పాటు

గాంధారి, ఆగస్టు 31 : గాంధారి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ఏర్పాటుచేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బండారి పరమేష్, వైస్‌చైర్మన్‌గా ఆకుల లక్ష్మన్‌ను చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ పరమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యేకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు.

'పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

గాంధారి, ఆగస్టు 31: గాంధారి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. శనివారం పీస్‌కమిటీ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. గణేష్ విగ్రహాల నిమజ్జన సమయంలో తాగి తప్పుగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని, మండపం ఏర్పాటుకు తప్పనిసరిగా పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, ట్రాన్స్‌కో ఏఈ సతీష్, గాంధారి పంచాయతీ కార్యదర్శి నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ రవి, మండలంలోని అన్ని పార్టీల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వంటపాత్రల వితరణ

భిక్కనూరు, ఆగస్టు 31 : భిక్కనూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు మధ్యాహ్నభోజన వంటపాత్రలను శనివారం రూ.27 వేల విలువగల వంట పాత్రలను 1990-91 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి మోహన్‌రావు అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనాథ్ మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన మోహన్‌రావు పాఠశాలపై మమకారంతో తన దాతృత్వాన్ని చాటారని కొనియాడారు. సుజాతమోహన్‌రావు దంపతులను స్ఫూర్తిగా తీసుకుని పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకరించాలని కోరారు.

'ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలి'

కామారెడ్డి రూరల్, ఆగస్టు 31: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లాలలోని ప్రధాన కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకిస్తు సెప్టెంబర్ 1న నిరసన కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

విద్యార్థిని మృతిపై విచారణ

● బాన్సువాడ గురుకుల పాఠశాల తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్



విచారణ చేపడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ, ఆగస్టు 31 : బాన్సువాడ గురుకులంలో ఏడోతరగతి చదువుతున్న అంజలి (12) అనే విద్యార్థిని నిజామాబాద్ తరలిస్తుండగా మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. జుక్కల్ మండలం పడంపల్లి గ్రామానికి చెందిన చైత్రభాయ్ శంకర్ దంపతుల కుమార్తె అంజలి ఏడో తరగతి చదువుతుంది. రెండురోజులుగా జ్వరంతో బాధపడటంతో శుక్రవారం సాయంత్రం బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం తగ్గకపోవడంతో నిజామాబాద్‌కు రిఫర్ చేయాలని వైద్యులు సూచించగా విద్యార్థిని తల్లికి సిబ్బంది సమాచారం ఇచ్చారు. మెరుగైన వైద్యం కోసం నిజా మాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి శనివారం పాఠశాలకు హుటాహుటిన చేరుకుని విద్యార్థిని మృతికి గల కారణాలను ప్రిన్సిపాల్ ధనలక్ష్మి తో పాటు సిబ్బంది తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గదుల ఆవరణ ను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించాయా అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ తెలిపారు. విద్యార్థిని మృతిపట్ల పూర్తిగా పరిశీలించి నిర్లక్ష్యంగా ఎవరైనా వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ తెలిపారు. సబ్‌కలెక్టర్‌తో పాటు మైనారిటీ గురుకుల ఆర్‌సీవో కిరణ్‌గౌడ్, డీఎండబ్ల్యూవో దయానంద్ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 31: మండలంలోని చండేగాం, మాదాపూర్, హంగర్గ గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను శనివారం జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ సందర్శించారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున పోలింగ్ కేంద్రాల స్థితిగతులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించారు. అనంతరం హంగర్గ పాఠశాలలో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజనం తయారును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఏజన్సీ దారులను ఆదేశించారు. అంతకు ముందు నాగల్‌గాం గ్రామంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తుదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిభావంతుడు శంకరమంచి'

నిజాంసాగర్, ఆగస్టు 31 : 33 ఏళ్ల బోధన అనుభవంతో విద్యార్థులలో తెలుగుభాష సంస్కృతుల పట్ల ఆదరాన్ని అభిమానాన్ని పెంచిన అధ్యాపకుడు, సాహితీమూర్తి శంకమంచి శ్యాంప్రసాద్ అని ఇగ్నో అడిషనల్ డైరెక్టర్ కే.రమేష్ అన్నారు. శనివారం ఉదయం నవోదయ విద్యాలయ నిజాంసాగర్‌లో జరిగిన డాశంకరమంచి శ్యాంప్రసాద్ పదవి విరమణోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యాలయ ప్రిన్సిపల్ ఎం. సత్యవతి అధ్యక్షతన జరిగిన సన్మానోత్సవ సభలో శ్యాంప్రసాద్ జీవితం-సాహిత్యంపై పల్లెర్ల రాంమోహన్‌రావు సంపాదకత్వంలో వెలువడిన శంకమంచీయం అభినందన సంచికను ఆయన ఆవిష్కరించారు. అలాగే మరో అతిథి ఎన్ఐఓఎస్ మాజీ రిజినల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ రోటె మాట్లాడుతూ నవోదయ విద్యాలయ సమితిలో ప్రతిభవంతుడైన శ్యాంప్రసాద్ ఒకరన్నారు. నవోదయ విద్యాలయ సమితి డిప్యూటి కమీషనర్ సందేశాన్ని డాక్టర్ కే.రమేష్ సభకు వినిపించారు.

బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన సబ్‌కలెక్టర్



బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయిని కలిసిన అధికారులు

నసురుల్లాబాద్, ఆగస్టు 31: నసురుల్లాబాద్ మండలం బొమ్మన్ దేవ్‌పల్లి గ్రామాన్ని శనివారం సాయంత్రం బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి పర్యవేక్షించారు. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి గ్రామంలోని సబ్‌స్టేషన్‌లోకి భారీగా నీరు చేరింది. అంతేకాకుండా గ్రామంలో అలుగులు ఏరులై పారాయి. గ్రామంలోని ఇళ్లలో నీరు చేరడంతో హుటాహుటిన గ్రామానికి చేరుకున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షం కారణంగా బయటకి ఎవరూ వెళ్లకూడదన్నారు. రికార్డు స్థాయిలో బొమ్మన్‌దేవ్‌పల్లిలో 137 ఎంఎం వర్షపాతం నమోదైంది.

ఠాగూర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి..

బాన్సువాడ మండలంలోని తాడ్కోల్‌శివారులో కొనసాగుతున్న ఠాగూర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కిరణ్మయికి ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా హాస్టల్ నిర్వహిస్తున్నారని, కనీస మౌలిక సదుపాయాలు లేకున్నా అధిక ఫీజు వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు విద్యార్థి సంఘ నాయకుడు సాయికుమార్ తెలిపారు.

బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయిని కలిసిన అధికారులు

బాన్సువాడటౌన్ : బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయిని శనివారం వివిధ శాఖలలో పనిచేస్తున్న అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. బాన్సువాడ పరిధిలో సబ్‌కలెక్టర్‌తో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణరెడ్డి , ఎంపీడీవో బసీరొద్దీన్ , సీనియర్ అసిస్టెంట్ విఠల్ , సూపరింటెండెంట్ ముజాహిద్ తదితరులున్నారు.

రుణమాఫీ కోసం బారులు తీరిన రైతులు



మర్కల్‌లో కుటుంబనిర్ధారణకై బారులు తీరిన రైతులు

సదాశివనగర్, ఆగస్టు 31 : మండలంలోని మర్కల్‌లో కుటుంబనిర్ధారణ చేయించుకోవడానికి వ్యవసాయ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవడానికి శనివారం బారులు తీరారు. రెండులక్షల రుణమాఫీ అని చెప్పి ఇబ్బందులకు గురిచేయడం మంచికాదని రైతులంటున్నారు.

చిన్నమల్లారెడ్డిలో హెల్త్‌క్యాంప్

కామారెడ్డి రూరల్, ఆగస్ట్ 31 : సీజనల్ వ్యాధులు విస్తరిస్తుండడంతో కామారెడ్డి మండల పరిధిలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో దేవునిపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.జోహ ముజీబ్, డా.దివ్య ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. క్యాంపులో ఆరోగ్య పరీక్షలు చేసుకోవడానికి వచ్చిన గ్రామ వృద్ధులు,మహిళలకు పరీక్షలు నిర్వహించి పలుసూచనలు చేసారు.అలాగే ప్రస్తుత కాలంలో డెంగ్యూమలేరియా,టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలుతుండడంతో జ్వరం వస్తే పీయంపి,ఆర్‌యంపిల వంటి వారి వద్దకు వెళ్లకుండా నిపుణులైన పీహెచ్‌సీ వైద్యుల వద్దకు వచ్చి పరీక్షలు చేసుకోని,చికిత్స తీసుకోవాలని అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ఇంటి పరిసరాలలో మురిగినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నిల్వఉన్న నీటిపై మూతలు ఉంచు కోవాలని సూచించారు.

వైద్యులు మెరుగైన సేవలందించాలి

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

మద్నూర్, ఆగస్టు 31 : వైద్యులు వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి సేవలందించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన శనివారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు తదితర వివరాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆసుపత్రిలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కావాల్సిన మందులు ప్రజలకు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే బడ్జెట్‌లో వైద్య ఆరోగ్యానికి అధిక నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. త్వరలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించి డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని అన్నారు. ఆయనతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు, మాజీ ఎంపీటీసీ కరేవర్ రాములు, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, నాయకులు రామ్ పటేల్, బండి గోపి, హనుమంత్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రమేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ యాదవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించాలి

● విద్యుత్‌శాఖ ఎస్ఈ రమేశ్‌బాబు



అధిరులతో మాట్లాడుతున్న ఎస్ఈ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 31: విద్యుత్ సమస్యలపై తక్షణమే సిబ్బంది స్పందించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ రమేశ్ బాబు తెలిపారు. శనివారం కామారెడ్డి సర్కిల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డాటాబేస్ సమాచారం ఏ లోకేషన్‌లో అయితే ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్ అయ్యే అవకాశం ఉన్నా వాటిని తనిఖీచేసి లోపాలను సవరించాలని, మరల ఫెయిల్ కాకుండా సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటివరకే చేపట్టిన యూనిక్‌పోల్ నంబరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, అలాగే మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని అన్నారు. బ్రేక్ డౌన్ పునరుద్ధరించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలని అన్నారు. వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన పంపుసెట్లకు విద్యుత్ ఇవ్వడానికి అంచనాలు, వర్క్ ఆర్డర్లను త్వరగా మంజూరుచేసి 30 నుంచి 45 రోజుల వ్యవధిలో కొత్త వ్యవసాయ కనెక్షన్‌ను మంజూరుచేయాలని, పంట కోతల తర్వాత యాసంగి సీజన్ మధ్య కాలంలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్‌లను మంజూరుచేయాలని అన్నారు. ఎక్కడైన విద్యుత్ మీటర్లు లేని వినియోగదారులు ఉన్నట్లయితే బీపీఎల్ వినియోగదారులు 500వాట్ల కంటే వారి యొక్కలోడ్ తక్కువ ఉన్నట్లయితే 500 కిలోవాట్ల వరకు తగిన చార్జీలుచెల్లించి కొత్త కనెక్షన్ పొందడానికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య

నాగిరెడ్డిపేట, ఆగస్టు 31 : మండలంలోని పోచారం గ్రామానికి చెందిన వృద్ధుడు కుర్మహన్మయ్య (77) జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం గ్రామానికి చెందిన వృద్ధుడు కుర్మహన్మయ్య గురువారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు, కుటుంబ సభ్యులు గుర్తించి అతడిని చికిత్స నిమిత్తం మెదక్‌ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు గతంలో చనిపోగా మానసికంగా కుంగిపోయి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఆగ్రోస్ చైర్మన్

బీర్కూర్, ఆగస్టు 31 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని శనివారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండ స్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్‌లు దర్శించుకున్నారు. శ్రావణమాసంలో ఆఖరి శనివారం కావడంతో ఎమ్మెల్యేతో పాటు ఆగ్రో చైర్మెన్‌లు శ్రీవారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శ్రీవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఇదిలా ఉండగా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రజలు శ్రీవారి సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భారీ కొండచిలువను హతమార్చిన రైతులు



రైతులు చంపివేసిన భారీ కొండచిలువ

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 31: జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామశివారులో రైతులు భారీ కొండ చిలువను హతమార్చారు. గ్రామానికి చెందిన కొందరు రైతులు గ్రామ శివారులోని సోయా పంటలో పని చేస్తుండగా కొండచిలువ కనబడటంతో భయాందోళనకు గురైన రైతులు తోటి రైతులకు విషయం తెలపడంతో కొండ చిలువను హతమార్చారు. సోయాపంట చేలలో పనిచేసుకునే రైతులు జాగ్రత్తగా ఉండాలని, పంట ఏపుగా పెరి గిన సమయంలో విషపురుగులు సంచరిస్తాయని రైతులు తెలిపారు. భారీ సైజులో కొండచిలువ కనబడటం ఇదే తొలిసారని రైతులు తెలిపారు.

'ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి'

గాంధారి, ఆగస్టు 31: ప్రతి ఉద్యోగి పదవి విరమణ తప్పనిసరి అని తహసీల్దార్ సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యదర్శి మోహన్‌రెడ్డి పదవి విరమణ సందర్భంగా మాట్లాడారు. డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ గాంధారి సింగిల్‌విండో సొసైటీని లాభాల బాటన నడిపించి సొసైటీకి మంచి పేరు తెచ్చిన వ్యక్తి మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇలాంటి ఉద్యోగస్తుడు ఉంటే అభివృద్ధి ముందుకు సాగుతుందని తెలిపారు. అనంతరం సొసైటీ పాలకవర్గం మోహన్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, సొసైటీ కార్యదర్శులు, మాజీసర్పంచ్, మాజీ ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్ లు రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 యాక్టు అమలు : ఎస్పీ

కామారెడ్డిటౌన్, ఆగస్టు 31: జిల్లాలో 30 యాక్టు అమలులో ఉందని ఎస్పీ సింధూశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 30 వరకు ఈ యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించినా, నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసు కుంటామని తెలిపారు. కావున జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

వాలంటీర్లకు సర్టిఫికెట్ల అందజేత

బాన్సువాడ టౌన్, ఆగస్టు 31 : బాన్సువాడ పట్టణ సీఐ శనివారం పోలీస్‌స్టేషన్లో కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లకు సర్టిఫికెట్‌లను అందజేశారు. తెలంగాణ హైకోర్టు లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు శిక్షణను పూర్తి చేసుకున్న వారిని అభినందించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కేసు, తగాదాలు, సమస్య పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం గురించి, గ్రామాలలో, పట్టణాలలో తగాదాల పరిష్కారంలో కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తారన్నారు. అందుకు తమ వంతు కూడా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంతోష్, అహ్మద్‌హుస్సేన్, రామకృష్ణారెడ్డి, పాగులగామ సాయిబాబా, పుష్పవతి తదితరులున్నారు.

విద్యుత్ వైర్ తగిలి విద్యార్థిని మృతి

నసురుల్లాబాద్, ఆగస్టు 31: నసురుల్లాబాద్ మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన గైనిస్వాతి (18) శనివారం మధ్యాహ్నం కురిసిన భారీవర్షానికి విద్యుత్ వైర్ తెగి పడింది. స్వాతి అది ముట్టుకోవడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని స్థానికులు, పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. స్వాతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ఆర్థికసాయం అందజేశారు.

పిడుగు పడి ఒకరికి గాయాలు

నసురుల్లాబాద్, ఆగస్టు 31 : నసుల్లాబాద్ మండలంలోని బొప్పాస్‌పల్లి గ్రామంలో శనివారం కురిసిన భారీ వర్షానికి గ్రామంలో పిడుగు పడింది. దీంతో గ్రామానికి చెందిన చవాన్ కిమ్యాకి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం గ్రామస్తులు ఆయనను బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అన్నాబావుసాఠే జయంతి

మద్నూర్, ఆగస్టు 31 : మద్నూర్ మండలం గోజేగావ్‌లో సాహిత్యరత్న, లోకశాహిర్ అన్నా బావు సాఠేజయంతి వేడుకలలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నాబావు సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ శివాజీ, నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రామారెడ్డి,ఆగస్టు 31: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు శనివారం కాంగ్రెస్ రామారెడ్డి మండల అధ్యక్షుడు లక్ష్మాగౌడ్ ఆధ్వర్యంలో రైతులకు చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అర్హులైన వారికి పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ అమ్ముల పశుపతి, రామారెడ్డి గ్రామ అధ్యక్షుడు రంజిత్ పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - సరిపోదా శనివారం
దర్శన్ - కమిటి కుర్రాళ్లు
ప్రియా 70 - ఆయ్
ప్రియా 35 - ఆహో విక్రమార్క

బాన్సువాడ

మహేశ్వరి - సరిపోదా శనివారం
వెంకటేశ్వర - తంగలాన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

